మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

డిగ్రీపై నిర్లక్ష్యం..!

ప్రవేశాలపై ప్రభుత్వం ఉదాసీనత

విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై పూర్తి నిర్లక్ష్యంగా కన్పిస్తోంది. డిగ్రీ ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గత ఏడాది కూడా ఇలాగే ఆల స్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కాలేజీల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలి పోయాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో సగానికి పైగా కళాశాల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. అడ్మిషన్లు ఆలస్యం కావడమే దీనికి ప్రధాన కారణ మని తెలుస్తోంది. గత ఏడాది తలెత్తిన ఇబ్బందులు కనీసం ఈ ఏడాదైనా ఎదురు కాకుండా ఉండా లంటే వేగంగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నత విద్యా శాఖకు పలు కళాశాలల ప్రతినిధులు ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఉన్నత విద్యా శాఖ పట్టించుకోలేదు. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీలో చేరాలనుకున్న విద్యార్థులందరూ అయోమయంలో ఉన్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇప్పటికే విద్యా సంవత్సరం పునఃప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరిచారు. ఇంటర్ తరగతులు కూడా ఈ నెల 1 నుంచే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదు. దీంతో వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో రాయలసీయ యూనివర్సిటీ పరిధిలో 89 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 10,600 సీట్లు ఉన్నాయి. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని మూడు డిగ్రీ కాలేజీల్లో 8,300 సీట్లు ఉన్నాయి. డిగ్రీ విద్యను నిర్లక్ష్యం చేయడం వెనుక ప్రయివేటు, కార్పొరేట్ ఇంజినీరింగ్ కాలేజీల మనుగడ కోసమే అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిస్థితి ఇలా ఉంటే ప్రయివేటు కళాశాలలు మాత్రం సీట్లు భర్తీ చేసుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రయివేటు డిగ్రీ కళాశాలలో ఇప్పటికే విద్యార్థులను కళాశాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ లేక పోవడంతో విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కొంత భాగం కోల్పోయే ప్రమాదం ఉంది. చదువులకు దూరంగా ఉండటం వలన చెడు వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగులుతున్న సీట్లు

సాధారణంగా అయితే 60 నుంచి 70 శాతం మేర సీట్లు భర్తీ అవుతుంటాయి. గడిచిన మూడేళ్ల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి. గతేడాది అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యంగా నిర్వహించడం, మూడు విడతలకు మధ్య ఎక్కువ రోజులు ఖాళీ రావడంతో ప్రవేశాలు మరింత తగ్గాయి. గత విద్యా సంవత్సరం దాదాపు 40 కళాశాలలకు పైగా 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. కొన్ని గ్రూపుల్లో 10 నుంచి 15 మంది మాత్రమే చేరారు. విద్యార్థుల సంఖ్య తగ్గిన అనేక గ్రూపుల్లో అడ్మిషన్లు నిలిపివేయాలని ఆయా కాలేజీలు నిర్ణయించాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అయినా ప్రవేశాలకు సంబంధించిన ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖను ప్రైవేటు కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. అడ్మిషన్లకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన తరువాత మూడు దశల్లో అడ్మిషన్లు ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం రెండు నెలలు సమయం పడుతుంది. అది కూడా వేగంగా చేస్తే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రవేశాలు కల్పించడం ఆలస్యమైతే సీట్లు భారీగా మిగిలిపోతాయి. ఆగస్టు నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తే కొంతలో కొంతైనా మేలు కలుగుతుందన్న భావనను ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్నత విద్యాశాఖ ఎప్పటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తుందో చూడాల్సి ఉంది.

ఆదేశాలు రాగానే చర్యలు

డిగ్రీ అడ్మిషన్లపై ఇప్పటి వరకూ ఉన్నత విద్యా శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే తగు చర్యలు తీసుకుంటాం.- **బి.విజయ్ కుమార్, రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ.**

తక్షణమే అడ్మిషన్లు ప్రారంభించాలి

ఇంటర్ పరీక్షలు అయిపోయి రెండు నెలలు పూర్తయింది. ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాల గురించి చర్యలు చేపట్టారు. డిగ్రీల్లో డబుల్ హానర్స్ తెస్తామంటున్నారు. వాటి గురించి క్లారిటీ లేదు. గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ విధానం వల్ల నచ్చిన కళాశాలలో సీట్లు రాక మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఏడాది ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలి. తక్షణమే ఆఫ్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి. ఐదేళ్ల డిగ్రీ కోర్సు కాకుండా మూడేళ్ల డిగ్రీనే కొనసాగించాలి. లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపడతాం.

- రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

స్మార్ట్ మీటర్ల భారాలను తిప్పికొట్టండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అడ్డదిడ్డంగా పాలకవర్గాలు ప్రజలపై విద్యుత్ భారాలను మోపుతున్నాయని, ప్రజలను చైతన్యపరిచి వాటిని తిప్పి కొట్టేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన జిల్లా కమిటి సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్మాట్ మీటర్ల ద్వారా ప్రజల మెడలకు ఉరితాల్లు బిగించే ప్రయత్నం చేస్తోందన్నారు. వ్యాపార సముదాయాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను బిగించడం పూర్తి చేసిన ప్రభుత్వం, 200 యూనిట్లు పైబడి విద్యుత్ బిల్లు వచ్చే గహ వినియోగదారులకు ఈ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. అధికారంలోకి రాకముందు లోకేష్ తన యువగలం పాదయాత్ర సందర్భంగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని పిలుపునిచ్చి, వారే నేడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగించడం కార్పొరేట్ల లాభాల కోసమే పాలకవర్గాలు అన్నది స్పష్టంగా కనబడుతోందన్నారు. అదేకాక నెల్లూరులో జగన్ బినామీ కోసం ఎనిమిది వేల ఎకరాలు కేటాయించారని ఆందోళన చేసిన టిడిపి నేడు అధికారంలోకి వచ్చాక ఆ 8వేల ఎకరాలనే కేటాయిస్తూ ఏకంగా నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రజల చెవుల్లో పూలు పెట్టి, పెట్టుబడిదారుల చేతుల్లో భూములు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి ప్రతి కార్యకర్త పోరాటాలను నిర్వహించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ, కె. వెంకటేశ్వర్లు, ఎండి ఆనంద్‌బాబు, కెవి.నారాయణ, టి.రాముడు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు బి. రామాంజనేయులు, ఎన్. అలివేలు, కె.అరుణ, వై. నగేష్, ఎం.రాజశేఖర్, విజయ్, హనుమంతు, లక్ష్మన్న, లింగన్న, గోవిందు, మోహన్, బాలకృష్ణ, నాగన్న పాల్గొన్నారు.

లైనింగ్ పనుల్లో లోపించిన నాణ్యత

- హెచ్ఎన్ఎస్ పనులను పరిశీలించిన సిపిఎం బృందం
- రెండు గంటల పాటు పని ఆపి రాస్తారోకో
- నిద్రావస్థలో హంద్రీనీవా అధికారులు - ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి-పత్తికొండ

హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల్లో నాణ్యత లోపంతో పనులు చేస్తున్నారని అధికారులపై సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పత్తికొండ మండలం హోసూరు గ్రామ సమీపంలో సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులను పత్తికొండ సిపిఎం బృందం పరిశీలించింది. నాసిరకపు పనులు చేస్తున్నారని కాంట్రాక్టర్‌ను సస్పెండ్ చేయాలని రెండు గంటల పాటు రోడ్లను దిగ్బంధం చేశారు. ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు సిపిఎం నాయకులకు విన్నవించి కాంట్రాక్టర్లతో మాట్లాడుతామని చెప్పడంతో ఆందోళనను విరమించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, మండల కమిటీ సభ్యుడు దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు లైనింగ్ పనులను చేపడుతుందన్నారు. హంద్రీనీవా అధికారుల, కాంట్రాక్టర్లు కుమ్మక్కుతో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని అన్నారు. ఇసుక , కంకర, సిమెంటు నాసిరకపు మెటీరియల్‌తో పనులు చేస్తున్నారని మండిపడ్డారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజనీరింగ్ అధికారి, పర్యవేక్షణ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని తెలిపారు. నాసిరకపు పనులతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కమిటీ సభ్యులు గంగన్న, సిఐటియు నాయకులు రవిచంద్ర, హోసూరు గ్రామ నాయకులు తిమ్మప్ప, రాజశేఖరు, రంగప్ప, ప్రజానాట్య మండలి కాశి, రమేష్, డివైఎఫ్ఐ అధ్యక్షులు దుగ్గెన్న తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

అక్రమ తొలగింపులు ఆపాలి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పైన రాజకీయ వేధింపులతో అక్రమ తొలగింపులను ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సాయిబాబాలు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకునే అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో జె నాగేశ్వరరావు, సిహెచ్ సాయి బాబాలు మాట్లాడారు. కర్నూలు నగరంలో అర్బన్ లో కల్లూరు అర్బన్ రూరల్ లో 23 సంవత్సరాల నుండి ఏజెన్సీలు నిర్వహిస్తున్నారన్నారు. అటువంటి సాంప్రదాయాన్ని కూటమి ప్రభుత్వం తమ అనుచరులకు ఇవ్వాలని క్షేత్రస్థాయి అధికారులపై రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు లొంగకుండా ఉండాలన్నారు. మంత్రి పేరు చెప్పి కర్నూలు నగరంలో పాత ఏజెన్సీ లేని రద్దు చేస్తున్నామని, కొత్త ఏజెన్సీలకు వంటలు అప్పగిస్తాం మీరు తక్షణమే తొలగిపొండని హెచ్చరికలు చేస్తున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులపై జరుగుతున్న రాజకీయ వేదింపులను పూర్తిస్థాయిలో నిలువరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్రమ తొలగింపులు జరగకుండా తగు చర్యలు తీసుకుంటారని డిఇఒ హామీ ఇచ్చారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. భారతి, జిల్లా కోశాధికారి లీలావతి, జిల్లా ఉపాధ్యక్షులు వాయి శ్రీవాణి, లక్ష్మీదేవి, సరోజమ్మ, అర్బన్ నాయకులు ఓఫియా రోకాబీ, బండి మెట్ట పద్మ, బాలమ్మ, గణేష్, పద్మ ఇసిఎం స్కూల్ సరోజమ్మ, షబానా, ప్రభుదాసు, డబ్ల్యూ లలిత, మానిక్యమ్మ, అనసూయమ్మ, ఫరీదా, మనీ రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

రైళ్లల్లో ఆకస్మిక తనిఖీలు

-అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం ఐజి ఆకే రవి కృష్ణఉత్తర్వుల మేరకు కర్నూల్ జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ కర్నూలు పోలీసులకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా కర్నూలు రైల్వేస్టేషన్ లో మీడియాతో మాట్లాడారు. కర్నూలు పోలీసులు, ఈగల్ టీం, స్పెషల్ పార్టీ పోలీసులు , డాగ్స్ స్క్వాడ్‌బృందాలు, రైల్వే ఆర్‌పిఎఫ్ , జిఆర్‌పి పోలీసులు సంయుక్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి ఉత్తరాఖండ్ రాష్ట్రం కర్నూలు మీదుగా వెళ్లే యశ్వంతపూర్ – యోగి నగరి రిషికేష్ రైలు లో (ట్రైన్ నెంబర్ 06597) జనరల్ బోగి నుండి ఎసి బోగీలను అన్నింటిని తనిఖీలు చేశారు. ఎలాంటివి లభ్యం కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాకు ఒక ట్రైన్‌ను కేటాయించి తనిఖీలు చేయాలని ఆదేశాలున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు , అక్రమరవాణాను అరికట్టే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశారని, ఈ నెంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం కర్నూలు రైల్వే స్టేషన్ లోని పార్సిల్ కార్యాలయంలో డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్‌పితో , కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, కర్నూలు టూ టౌన్ సిఐ నాగరాజారావు, అబ్దుల్ గౌస్, గుణశేఖర్ బాబు, కర్నూలు టు టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

భవననిర్మాణ కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమావేశంలో మాట్లాడుతున్న సుధాకరప్ప

ఈనెల తొమ్మిది న నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయా లని సిఐటియు నాయ కులు కోరారు. గురువారం కల్లూరు మట్టి పని అడ్డా కార్మికుల సమావేశం కల్లూరు సూర్యానారాయణ భవన్‌లో నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు కె.సుధాకరప్ప, ఉపాధ్యక్షులు జి.ఏసు మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రద్దుచేసి భవన నిర్మాణ కార్మికులను రోడ్డుపాలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉన్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడం వల్ల కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. ఇదే కొనసాగితే రాబోయే కాలంలో జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ చట్టం అమలు కోసం ఈ నెల 9న జరుగు సమ్మెలో మట్టి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. కార్యక్రమంలోఎస్. చాందిని, ఆంజనేయులు, రత్నం, పకీరప్ప, మునిస్వామి, మట్టి పని కార్మికులు పాల్గొన్నారు.



చందన బ్రదర్స్‌లో ఆడి శ్రావణం సేల్

-ఆల్ వెరైటీస్ పై 61 శాతం ఆఫర్

-మెన్స్ వేర్ పై 30 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న చందనా బ్రదర్స్ జూలర్స్ అండ్ టెక్స్‌టైల్స్‌లో ఆషాడం సందర్భంగా ఆడి శ్రావణం సేల్ ప్రారంభమైందని మేనేజర్ నాగు తెలిపారు. ఈ సేల్‌లో భాగంగా అన్ని వెరైటీస్‌పై 61 శాతం ఆఫర్ ఉందని, కంచి వెజిటబుల్ డిజైనర్, కంచి టిష్యూ, 6శాతం కంచి లైట్ వెయిట్, సాఫ్ట్ క్రష్, సాఫ్ట్ చందేరి, రామ్యాంగో కడువా ,మ్యాంగో క్రేపర్ శారీస్ పై స్పెషల్ ఆఫర్స్ ఉన్నాయని తెలిపారు. మెన్స్ వేర్ లో 30 నుంచి 50శాతం డిస్కౌంట్ ఉందన్నారు. ప్రత్యేక కౌంటర్స్ లో వన్ ప్లస్ వన్ వన్ ప్లస్ టు ఆఫర్స్ కలవని తెలియజేశారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. చందన బ్రదర్స్ జువెలర్స్ అండ్ టెక్స్టైల్స్ జెడ్ పి ఆఫీస్ ఎదురుగా కర్నూలు ఫోన్ :9494509942

ఏడాది పాలనపై ఇంటింటి ప్రచారం

పాల్గొన్న ఎమ్మెల్సీ బీటి నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో కర్నూలు నగరంలో ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా గరువారం కర్నూలు నగర టిడిపి అధ్యక్షులు నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో 25వ వార్డు, బూత్ నెం 75,76 లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బిటి.నాయుడు, ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ పూలనాగరాజు, పార్టీ ప్రదాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, డిసి. ఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్, పార్టీ ప్రదాన కార్యదర్శి అకెపోగు ప్రభాకర్ తో పాటు పార్టీ ముఖ్యులుగా హాజరై కూటమి ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్న విషయాలను గురించి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా చేసిన అభివృద్ధి ముఖ్యంగా సామాజిక పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్, ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఉచిత ఇసుక పాలసీ, అన్నా క్యాంటీన్ల పునః ప్రారంభం, తల్లికి వందనం క్రింద ప్రతి విద్యార్థి తల్లికాతాలో ఒక్కొరికి రూ.13ల చొప్పున జమ చేయడం, వంటి వాటితోపాటు రానున్న రోజులలో రైతన్నలకు ఆర్ధిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యము, నిరుద్యోగభృతి వంటి వాటిని అందజేయునున్నట్లు ప్రజలకు తెలిపారు. వైఎస్.జగన్ చేసిన అరాచకాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం, రానున్న రోజులలో ఇలాంటివారిని ఆదరిస్తే రాష్ట్రం తిరిగి హత్యల ఆంధ్రప్రదేశ్ గా మారే ప్రమాదముందన్నారు. ఇలాంటి అరాచక శక్తిని సమాజం నుండి దూరంగా ఉంచాలని ప్రజలను కోరారు. జగన్ అనునిత్యం చేస్తున్న అబద్ధ ప్రచారాలను ప్రజలు గమనించాలని సూచించారు. వార్డు ఇన్‌ఛార్జి పి.రాజశేఖర యాదవ్ బాలు, సుధాకరరెడ్డి గారితోపాటు రాష్ట్ర కార్పోరేషన్ల డైరెక్టర్లు కె. నాగేంద్రకుమార్, విజయకుమార్, డి. జేమ్స్, పోతురాజు రవికుమార్, అఖిల్, సత్రం రామక్రిష్ణుడు, యస్.కె. బషీర్, బూత్ ఇన్చార్జీ చలపతి మొదలగు వారు ఇటిఇటికి వెళ్లిన వారిలో ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బిటి.నాయుడు

సి బెళగల్ : సి బెళగల్ లో టిడిపి ఏడాది సుపరి పాలనపై కెడిసిసి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటన చేశారు. ఇందులో మండల నాయకులు ఈరన్న గౌడ్, మల్లికార్జున గౌడ్, చిన్న తిమ్మప్ప, టడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ఆయనకు ఘనస్వాగతం పలికారు. సుపరి పాలనపై ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న పాలన సంతృప్తికరంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. చివరగా సి.బెళగల్ లో బస్టాండ్, మార్కెట్, రోడ్లు అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేయగా అందుకు స్పందన చూపి త్వరలో సిబెళగల్ అభివృద్ధి ఊహించని స్థాయిలో చూస్తారని విష్ణు వర్ధన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

సి బెళగల్ లో ఇంటింటి ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి

హై రిస్క్ గర్భవతుల సేవలపై వైద్యులకు శిక్షణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులలో పనిచేసే వైద్యులకు హైరిస్క్ గర్భవతులకు అందించాల్సిన సమగ్ర సేవలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అర్మాన్ సంస్థ ద్వారా నిర్వహించారు. జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మాతా శిశు సంరక్షణకు నిరంతరం కృషి చేయాలన్నారు. గర్భిణీ అని నిర్ధారణ అయిన వెంటనే తగిన వైద్య పరీక్షలు చేయాలని నిర్ణీత సమయంలో వారికి స్కానింగులు, పరీక్షలు, వైద్య సేవలను అందిస్తూ ప్రసవం సురక్షితంగా అయ్యేవిధంగా చూడాలని తెలిపారు. పరీక్షలు, వైద్య సేవల వివరాలను మాతా శిశు సంరక్షణ కార్డులో పొందు పరచాలని అన్నారు. డాక్టర్ రోహిణి, డాక్టర్ భావన పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలలలో ప్రమాదకర పరిస్థితిలను ముందుగానే అంచనా వేసి క్షేత్ర స్థాయి నుంచి స్పెషలిస్ట్ స్థాయి వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఫాలో అప్ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్.మహేశ్వర్ ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, డిపిఎంఒ డాక్టర్.ఉమా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుండి డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ శ్రావణి, డిపిఒ విజయరాజు, గణాంకాధికారి హేమసుందరం, డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణ, డెమో శ్రీనివాసుల శెట్టి, పిహెచ్ఎన్ మీనాక్షి, ఆరోగ్య విద్యా భోదకురాలు పద్మావతి ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఆటోల బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న ప్రభాకర్

కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా చేపడుతున్న ఆటోలో బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం ఓర్వకల్లు ప్రజాసంఘాల కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ మండల మహాసభ షాజహాన్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ , సిఐటియు మండల కార్యదర్శి జి శ్రీదర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. జిల్లా ఆటోల బంద్ నిర్వహిస్తున్నామని ఈ ఆటోల బందులో ఆటో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డ్రైవర్లకు భారంగా మారినటువంటి జీవో నెంబర్ 21 కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో యూనియన్ ఓర్వకల్లు మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా శ్రీధర్ అధ్యక్షులుగా నాగభూషణం ఉపాధ్యక్షులుగా ప్రతాప్, రమణ, అశోక్, మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్.షాజహాన్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, మధు, మురళి, లింగమూర్తి. కోశాధికారిగా నజీర్ ఇంకా ఎనిమిది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మహాసభకు హుసేనాపురం ఉయ్యాలవాడ మీదేముల కన్నమడకల ఓర్వకల్లు తదితర గ్రామాల ఆటో డ్రైవర్లు హాజరయ్యారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పత్తికొండ ఎంపిడిఒ కవిత అన్నారు. గురువారం పత్తికొండ పట్టణంలో 5వ, 6వ వార్డుల్లో ఎంపిడిఒ కవిత, డిప్యూటీ ఎంపిడిఒ నరసింహులు పర్యవేక్షించి ప్రజలకు పొడి–తడి చెత్త పై, ఐవిఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు.ఎంపిడిఒ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయరాదని ప్రజలకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీలోకి చెత్త బండ్లు వచ్చినప్పుడు చెత్తను వేయాలని అన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తామని అన్నారు.

అర్హులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

-తహాశీల్దార్ గుండాల నాయక్



ప్రజాశక్తి-మద్దికేర : అర్హులైన నిరుపేదలు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని తహాశీల్దార్ గుండాల నాయక్ తెలిపారు. గురువారం తహాశీల్దార్ కార్యాయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి మూడు సెంట్లు స్థలం, పట్టణాల్లో నివసించే వారికి రెండు సెట్లు స్థలం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇల్లు స్థలాలు లేని నిరుపేదలు తమ పరిధిలో ఉన్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు ఆధార్ కార్డు రేషన్‌కార్డు, అందజేసి దగ్గరుండి దరఖాస్తు చేయించు కోవాలన్నారు.గత ప్రభుత్వంలో ఇందిరమ్మ, ఇల్లు నిర్మాణం పొందిన వారికి, జగనన్న లేఔట్ లో ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణం పొందిన వారకి, కారు, ఉన్నవారకి, దరఖాస్తు చేసుకునే అర్హత లేదన్నారు. 10 ఎకరాలులోపు సాగుభూమి ఉన్న వాళ్ళు మాత్రమే లబ్ధిదారులుగా ఉండాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరులో బీసీ సంక్షేమ (ప్రీ మెట్రిక్) బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం ఎమ్మెల్యే బి.విరుపాక్షికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బసవరాజు మాట్లాడారు. వలసలకు నిలయంగా మారిన ఆలూరులో బీసీ (ప్రీ మెట్రిక్) బాలికల సంక్షేమ వసతి గృహం లేక చాలా ఏళ్ల నుంచి 5వ తరగతి వరకే చదివి బాలికలు మధ్యలోనే ఆపేస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐగా హాలహర్వి, చిప్పగిరి, హోళగుంద, ఆస్పరి, దేవనకొండ మండల, గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చేసినట్లు చెప్పారు. కేవలం వసతి గృహం లేకపోవడం వల్లనే పిల్లలను చదివించుకోలేకపోతున్నామని చాలామంది విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వలస వెళ్తే పిల్లలను ఎక్కడ ఉంచి చదివంచాలో అర్థం కావడం లేదని.. ప్రస్తుత సమాజంలో చదువుల కోసం పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో పిల్లకు ఏదైన జరుగుతుందేమోనని భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. అందుకే చదువులను మధ్యలోనే ఆపేసి దూర ప్రాంతాలకు వలసలు తీసుకెళ్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆలూరులో బీసీ బాలికల సంక్షేమ వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరారు. ఆలూరు డివైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షులు గోవర్ధన్,ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉపేంద్ర, తేజ, అబ్దుల్ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

మాట్లాడుతున్న సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి చెత్తను సేకరించాలని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. గురువారం మండలంలోని జొహరాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. డ్రెయినేజీ కాలువలు లేక రోడ్లపై పారుతున్న మురుగు నీరు, ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉండడం చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఆస్పరిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో రోజూ చెత్తను సేకరించి, శానిటేషన్ చేయాలని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ట్రై సైకిళు, గ్రీన్ అంబాసిడర్లు లేని పంచాయతీల్లో పది రోజుల్లోపు భర్తీ చేయాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒ గీతా వాణి, ఇఒఆర్‌డి విజయ భాను పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభించిన ఎంపిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని మొట్టి వీధిలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ఎంపిపి టి.నసురుద్దీన్, వైసిపి జిల్లా కార్యదర్శి టికె.బందెనవాజ్ గురువారం ప్రారంభించారు. అనంతరం స్థానికులు వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొట్టి వీధిలో స్థానిక ప్రజలు దశాబ్దాలుగా సిసి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి నసురుద్దీన్ చొరవ చూపడంతో పాటు మండల పరిషత్ నిధులను మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. వైసిపి మండల ఉపాధ్యక్షులు చికెన్ రాజా, చేనేత కార్యవర్గ సభ్యులు పద్మనాభం, జిల్లా మైనార్టీ కార్యదర్శి పి.నదీముల్లా, కె.మాబువలీ, నాగేష్ పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపిపి

ఎరువుల కోసం రైతుల పాట్లు

- దొరకని యూరియా

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. వర్షం పడిందంటే చాలు రైతులు పంటలకు అవసరమైన ఎరువులను తీసుకెళ్లి చల్లేందుకు ఎరువు షాపుల ముందు బారులు తీరుతారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకూ వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులు, పశుసంపద తగ్గిపోవడం, అత్యధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రైతులు కొన్ని దశాబ్దాల క్రితమే సేంద్రీయ ఎరువు వాడకాన్ని మరిచిపోయారు. భూములు పెడసుబారుతున్నా రసాయనిక ఎరువులు, పురుగు మందులను పోటీ పడి మరీ వాడుతున్నారు.

ఈ క్రమంలో రూ.100 నుంచి రూ.120 ఉన్న యూరియా బస్తా, రూ.300 నుంచి రూ.400లోపు ఉన్న

ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

ఫ్యాక్ట్ 50 కిలోల ఎరువుల బస్తా ధర 20:20:0:13, డిఎపి, 14:35:14 ఇలా రకాన్ని బట్టి ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,750లకు చేరింది. మండలంలో ప్రధానంగా పత్తి, వేరుశనగ పంటలను రైతులు సాగు చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గురువారం ఉదయాన్నే రైతులు పంటలకు అవసరమైన యూరియా, ఫ్యాక్ట్ ఎరువుల కోసం షాపుల ముందు బారులు తీరారు. ఎన్ని చోట్ల తిరిగినా యూరియా ఒక బస్తా కూడా దొరకకపోవడంతో అందుబాటులో ఉన్న ఎరువులనే తీసుకొని వెళ్లారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు చొరవ తీసుకొని యూరియాతోపాటు రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మూడు రోజులుగా బస్తా కూడా దొరకలేదు

- రైతు కురువ లక్ష్మన్న, ఒంటెడుదిన్నె.

నాకున్న ఎకరాతో పాటు ఐదెకరాలు కౌలుకు తీసుకొని మొత్తం ఆరెకరాల్లో పత్తి సాగు చేశాను. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎరువుల కోసం మూడు రోజులుగా కోడుమూరు, గోనెగండ్ల, కైరవాడి సొసైటీల్లో తిరిగాను. ఒక బస్తా యూరియా కూడా దొరకలేదు. కొన్ని చోట్ల కాంప్లెక్స్ ఎరువు కొంటేనే యూరియా బస్తా ఇస్తామని అంటున్నారు.

అందుబాటులో ఉన్న ఎరువులతో సరి

- రైతు పాముల సలాం, గోనెగండ్ల

మూడెకరాల్లో వేరుశనగతో పాటు పత్తి పంట సాగు చేశాను. ఈ దశలో యూరియా వేస్తే పంట ఏపుగా పెరుగుతుంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఎరువులు చల్లుకోవడానికి ఇదే అదను. ఆలస్యం చేస్తే తడి ఆరిపోతుంది. ఉదయం నుంచి గోనెగండ్లలోని అన్ని షాపులకు తిరిగినప్పటికీ యూరియా లేదని అంటున్నారు. గత్యంతరం లేక అందుబాటులో ఉన్న ఇతర ఎరువులతో సరిపెట్టుకుంటున్నాను.

తగిన చర్యలు చేపట్టాం

- ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ

మండలంలోని రైతులకు యూరియాతో పాటు ఇతర ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అవసరమైన తగిన చర్యలు చేపట్టాం. శుక్రవారం ఉదయంలోపు గోనెగండ్ల, హెచ్.కైరవాడి సొసైటీలతో పాటు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులోకి రానుంది.

హోరాహోరీగా వేలం పాట

ప్రజాశక్తి - నందవరం

దినసరి, వారపు మార్కెట్, బండ్లమెట్ట, కమేలాకు సంబంధించిన వేలం పాట హోరాహోరీగా సాగింది. డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, సర్పంచి తోట సావిత్రమ్మ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో దినసరి మార్కెట్, బండ్లమెట్టను రూ.1.21 లక్షలు, వారపు సంతను రూ.40 వేలకు సుజ్ఞానం కుమారుడు బాబు దక్కించుకున్నారు. కమేలాను రూ.23 వేలకు స్వామిరాజు కుమారుడు మీసాల శాంతిరాజు దక్కించుకున్నారు. డిప్యూటీ ఎంపిడిఒ మాట్లాడుతూ... పాటదారులకు తగు సూచనలు చేశారు. వేలంపాట దక్కించుకున్న వ్యక్తులు నిబంధనల ప్రకారం సకాలంలో నగదు చెల్లించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

క్షయ వ్యాధి నివారణకు చర్యలు

- వైద్యాధికారి త్రివేణి

ప్రజాశక్తి - ఆదోని

క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు అరుణ జ్యోతి నగర్ యుపిహెచ్‌సి వైద్యాధికారి త్రివేణి తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాబు రాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మ బాయి, ఆశావర్కర్లు సునీత, లక్ష్మి, వరలక్ష్మి, రఫియా ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- డిప్యూటీ కమిషనర్ విజయ రాజు

ప్రజాశక్తి - కౌతాళం

సమావేశంలో మాట్లాడుతున్న విజయ రాజు

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయ రాజు తెలిపారు. గురువారం దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ముఖ్యంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి దర్శనం, తాగునీరు, వసతి (గదులు), అన్నదాన సౌకర్యం, ప్రసాదాలు, స్నానాలకు సౌకర్యాలు, మురుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ తదితర వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పుణ్యక్షేత్రంలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా శుద్ధజలాలు అందించడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సమక్షంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. దేవాలయంలో లోపలి భాగంతో పాటు పుణ్యక్షేత్రం నలువైపులా తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులు బస చేయడానికి గదులను ఆధునీకరించినట్లు చెప్పారు. ప్రస్తుతం నిత్యాన్నదానం సత్రంలో మధ్యాహ్నం మాత్రమే భోజనం ఒక చోటే అమలవుతోందని, శ్రావణమాసం నుంచి రాత్రి పూట కూడా భక్తులకు భోజన సౌకర్యం కల్పించి, కనీసం మూడు చోట్ల భక్తులకు అన్నదానం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు, వివిధ టికెట్ల ధర రూపంలో దర్శన సౌకర్యాలతో పాటు, కొత్త తరహాలో విఐపిల కోసం రూ.500తో ప్రత్యేక దర్శనం, రూ.వెయ్యితో గర్భగుడి దర్శనం సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి సలహాలు స్వీకరించి, పనులు వేగవంతం చేస్తామని వివరించారు. పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, కుమార్, ముఖ్య అర్చకులు శివన్న స్వామి, నాగరాజు స్వామి పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన ఎస్ఎస్ ట్యాంకు

- స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రజల దాహార్తిని తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ నీటి ట్యాంకు గోడలు మళ్లీ పగుళ్లు ఇచ్చాయి. ఇప్పటికే రెండుసార్లు పగుళ్లు ఇవ్వగా అధికారులు మరమ్మతుల కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. మళ్లీ గోడలు కుంగిపోవడంతో ఆదోని ప్రజలకు నీరెలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ రామ్మోహన్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఆదోని ప్రజలకు ఇక్కడి నుంచే నీరు సరఫరా చేయాల్సి ఉంది. ఎల్ఎల్‌సికి నీటి ప్రవాహం పెరగగానే ట్యాంకును నింపాల్సి ఉంది. ఈ సమయంలోనే ట్యాంకు మళ్లీ కుంగడంతో నీటి నిల్వకు సమస్యగా మారింది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కూడా 150 మీటర్లు కుంగినట్లు అధికారులు అంచనా వేశారు. గతంలోనే సుమారు 200 మీటర్లు సైడ్ గోడ కుంగడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి సుమారు రూ.80 లక్షల వరకు ఖర్చు చేసినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. మరోచోట సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కుంగడంతో నీటి నిల్వ ఎలా అన్నది అంతు పట్టని సమస్యగా మారింది. సుమారు 3,110 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 20 రోజులకు సరిపడే నీరు నిల్వ ఉందని అధికారులు చెబుతున్నారు.

ట్యాంకును పరిశీలించిన ఎస్ఇ

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సైడ్ గోడ కుంగడంతో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ మోహన్ రెడ్డి, డిప్యూటీ ఎస్ఇ సతీష్, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలపతి రెడ్డి ట్యాంకును పరిశీలించారు. కుంగిన ప్రదేశాన్ని పరిశీలించి టెక్నికల్ సమస్య ఉందని గ్రహించారు. ట్యాంకు పటిష్టతకు నిధులు మంజూరు చేయిస్తామని ఎస్ఇ తెలిపారు. కట్ట పటిష్టంగా ఉండాలంటే సిడిఒ అధికారులకు వెంటనే లెటర్ రాయాలని సూచించారు. వారి సూచన మేరకు ట్యాంకు మరమ్మతు పనులు చేద్దామని తెలిపారు. చెరువు మరమ్మతుల కోసం రూ.35 కోట్లు కేటాయిస్తున్నట్లు తీర్మానం కూడా జరిగిందని చెప్పారు. డిప్యూటీ ఇంజినీర్లు గోపీనాథ్, రామ్మూర్తి ఉన్నారు.

కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఇ

చర్యలు తీసుకుంటున్న అధికారులు

దోపిడీని అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల నుంచి దర్శనం పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టేందుకు శ్రీమఠం అధికారులు చర్యలు చేపట్టారు. స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు శీఘ్ర దర్శనం పేరుతో శ్రీమఠంలోని కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు వచ్చిన నేపథ్యంలో గురువారం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ స్పందించారు. భక్తులకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి దర్శన అవకాశం కల్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం ఉత్తర ద్వారం గుండా భక్తులను బయటకు పంపించారు.

డప్పు కళాకారులను గౌరవిద్దాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

డప్పులు పంపిణీ చేస్తున్న కృష్ణమ్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

డప్పు కళాకారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. గురువారం మండలంలోని బైచిగేరి గ్రామంలో 12 మంది డప్పు కళాకారులకు గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సమితి, టిడిపి నాయకులు బెస్త ఓంకార్ సహకారంతో డప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొహర్రం పండగను గ్రామాల్లో ప్రజలందరూ కలిసి మెలిసి జరుపుకోవాలని కోరారు. డప్పు కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించడం ఆనందదాయకని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఓంకార్, ఆంజనేయ, దస్తగిరి, డబ్బా రాముడు, ఖాసీం, అశోక్, రాజశేఖర్, వెంకటేష్, దేవరం, చిన్నస్వామి, అంజి, రాజు, గౌర హుస్సేని, మైనార్టీ సీనియర్ నాయకులు సాధిక్ వలీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వం సానుకూల స్పందన

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపట్టగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పీరా సాహెబ్, సోమన్న, అహ్మద్ తెలిపారు. ఆదోనిలో ఇంజినీర్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష గురువారం 31వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ... ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే జీతాలు పెంపు విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీవితాలు కచ్చితంగా పెరుగుతాయని సిడిఎంఎస్ కార్మిక నాయకులకు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

బకాయి చెల్లించి రెన్యువల్ చేసుకోండి

- సహకార సంఘం సిఇఒ హరికృష్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి

బెల్డోన సహకార సంఘంలో రుణాలు పొందిన ప్రతి రైతూ బకాయిలను చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని బెల్డోన సహకార సంఘం సిఇఒ హరికృష్ణ తెలిపారు. గురువారం చిప్పగిరిలోని బెల్డోన సహకార సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బకాయి ఉన్న రైతులందరూ వన్ టైం సెటిల్‌మెంట్ చెల్లిస్తామని అనుకోవడం పొరపాటని, తప్పనిసరిగా సహకార సంఘంలో అప్పు ఎంత ఉందో అంతా కట్టాల్సి ఉంటుందని తెలిపారు. తీసుకున్న రుణాలు మాఫీ అవుతాయని కూడా భ్రమలో ఉంటారని, రైతులందరూ ఇది గమనంలో ఉంచుకొని సహకార సంఘానికి వచ్చి అప్పునకు వడ్డీ ఎంత అయింది అనేది తెలుసుకొని పూర్తిగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని కోరారు. సకాలంలో కట్టకపోతే నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. బ్యాంకు సిబ్బంది ముక్కన పాల్గొన్నారు.

మాజీ సిఎంను కలిసిన ఆరెకల్ నాగరాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆరెకల్ విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ ఆరెకల్ నాగరాజ్ మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జగన్‌ను శాలువాతో సన్మానించి, ఆదోని నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. కేడర్ ధైర్యంగా ఉండాలని, 2029లో వైసిపి అధికారంలోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు వైసిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

టిడిపితోనే సుపరిపాలన : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో టిడిపితోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే, పిఎసి సభ్యులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18, 19వ వార్డుల్లో ఎమ్మెల్యే బీవీ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నేత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభివృద్ధిని పూర్తిస్థాయిలో ముందు తీసుకెళ్తున్నారని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి సూపర్ సిక్స్ హామీని అమలు చేస్తారన్నారు.

ఆదోని : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్, ఎపి విత్తన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి ఆధ్వర్యంలో వాల్మీకి నగర్‌లో 'సుపరిపాలనకు తొలి అడుగు' నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనాలోచిత నిర్ణయాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేసి రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. త్వరలోనే రైతులకు భరోసా, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం వంటి పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. మారుతి నాయుడు, రామస్వామి, మారుతి, బసాపురం వెంకటేష్, వాల్మీకి వెంకటేష్, రవి, బుద్ధారెడ్డి, మహిళా నాయకులు సాధిక, నీలకంఠ, అంజి, నాగేంద్ర, వెంకటేష్, కాశీ ఉన్నారు. **మంత్రాలయం** మండలం కలుదేవకుంట గ్రామంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, నాయకులు ఇంటింటికీ తిరిగి తల్లికి వందనం, పింఛన్లు, గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన సొమ్ము అకౌంటులో పడిందా లేదా అని టిడిపి కరపత్రాలు అందజేసి అడిగి తెలుసుకున్నారు. మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, మంత్రాలయం ఎంపిటిసి వెంకటేష్, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, మంచాల వ్యవసాయ పరపతి సంఘం డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, సభ్యులు చేపల నాగేష్, నాయకులు కంసాలి నరసింహ, వగరూరు పవన్ కుమార్, లింగప్ప, గ్రామ నాయకులు రాగన్న, మల్లయ్య, కలుదేవకుంట వ్యవసాయ పరపతి సంఘం డైరెక్టర్ కురువ భీమయ్య, ఈడిగ రాఘన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండలం దైవందిన్నె, ఏనుగుపాల గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్ మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నాయకులు రామచంద్ర, రామాంజనేయులు, శేఖర్ గౌడ్, పెద్దయ్య, రామలింగారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, చిన్న, ప్రభుదాస్, ఇసాక్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఆదోనిలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మంత్రాలయంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు : ప్రచారం నిర్వహిస్తున్న వెంకటేష్

'9న సమ్మెను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జయశ్రీ కోరారు. గురువారం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఆలూరు ఐసిడిఎస్ సిడిపిఒ నరసమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక, కర్షక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను హరించే విధానాలకు స్వస్తి పలకాలని తెలిపారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందించి, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, ఇతర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈనెల 9న చేపడుతున్న సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు కృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ నాగరత్నమ్మ, చంద్రమ్మ, నీలవేణి, అశ్విని పాల్గొన్నారు.

సిడిపిఒకు సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్వాడీలు

రచ్చుమర్రిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో గతవారం రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఫిల్టర్ నీరు తాగడానికి కూడా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం జనసేన రచ్చుమర్రి గ్రామ నాయకులు ఏసేపు పంచాయితీ కార్యదర్శికి ఫోన్‌లో నీటి సమస్యపై తెలుపగా స్పందించలేదని తెలిసింది. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు రచ్చుమర్రి గ్రామంలో నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. గ్రామంలో పంచాయతీ నీరు సరఫరా చేస్తున్న బోర్లను వ్యవసాయ పంటలకు వాడుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

టిడిపి గ్రూపు విభేదాలు వీడేనా..!

- 'సుపరిపాలన తొలి అడుగు'కు రెండు గ్రూపులు హాజరయ్యేనా..?

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. 2024 శాసనసభ ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వీరభద్ర గౌడ్ సుమారు 2 వేల ఓట్లతో ఓడిపోయారు. అప్పటి నుంచి టిడిపిలో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులు ఒక గ్రూపుగా, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఒక గ్రూపుగా విడిపోయారు. ఆలూరు నియోజకవర్గ స్థాయిలో వీరభద్ర గౌడ్ నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు వైకుంఠం శివప్రసాద్ గ్రూపు దూరం ఉంటోంది. 'సుపరిపాలన తొలి అడుగు' పేరుతో నిర్వహించే కార్యక్రమాలపై టిడిపి దేవనకొండ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. కమిటీ సభ్యులుగా టిడిపి అధిష్టానం రాయలసీమ ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డిని నియమించింది. దేవనకొండలో శుక్రవారం నిర్వహించే సమావేశానికి వారు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రెండు గ్రూపుల టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరవుతారా..? లేదా అనే ప్రశ్న టిడిపి సానుభూతిపరులు, నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది. దేవనకొండ మండలం మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు ఉన్నప్పటి నుంచి టిడిపికి కంచు కోటగా ఉండేది. ఆయన మరణానంతరం టిడిపి బలోపేతం కొంతవరకు తగ్గినప్పటికీ టిడిపికి స్థానిక సంస్థలు, మండల పరిషత్, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు బ్యాంకు తగ్గలేదు. ఒకే తాటిపై ఉండాల్సిన టిడిపి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపుగా మండలంలో టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున, బడిగింజల రంగన్న, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, మలకన్న, బంటుపల్లి వెంకట స్వామి గౌడ్, వెలమకూర్ సర్పంచి భాస్కర్, తెలుగు యువత ఆలూరు అధ్యక్షులు రాజాసాబ్, కొంతమంది టిడిపి గ్రామాల నాయకులు ఉన్నారు. అలాగే టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ గ్రూపుగా రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, మాజీ ఎంపిటిసి రామారావు నాయుడు, నేలతలమరి సర్పంచి నాగరాజుగౌడు, టిడిపి నాయకులు అలారుదిన్నె మల్లయ్య, నెల్లిబండ మల్లికార్జున గౌడ్, పల్లెదొడ్డి రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్ మరి కొంతమంది టిడిపి నాయకులు ఉన్నారు. మండలాల్లో నిర్వహించే చిన్నచిన్న పార్టీ కార్యక్రమాలు, సమావేశాలకు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాలు, సమావేశాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. మండలంలో నిర్వహించే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాలకు టిడిపి పెద్దలను ఇన్‌ఛార్జీలుగా నియమించడంతో టిడిపిలోని రెండు గ్రూపులు ఒకే తాటిపైకి వస్తాయా..?, లేదా? అని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఖాసీంవలీకి ఎల్లప్ప శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నందవరం

టిడిపి మండల అధ్యక్షులుగా ఎన్నికైనా మాచాపురం ఖాసీం వలీకి జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సన్మానించారు. జనసేన నాయకులు అంజి, చంద్ర, ఇర్ఫాన్ బాష, నరసింహులు, బంగారి, జలాల్ బాష, ఆదిల్ తిరుమల, అడవన్న, పూలచింత శంకర్, భాస్కర్, అంజి, గోవింద పాల్గొన్నారు.

ఖాసీం వలీని సన్మానిస్తున్న నాయకులు